## క్లుప్తంగా

### గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిల్లకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రవేశానికి 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంగ్లీషు మీడియం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అనీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునేందుకు చివరి తేదీ మార్చి 6న ముగుస్తుందని ఏప్రిల్ 6వ తేదీ ఆదివారం ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. ఉదయం 9 గంటల నుంచి 5 వ తరగతికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్ ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామని అన్నారు.

### రాపూరులో...

రాపూరు: మండలంలోని కండలేరు బాలికల గురుకులంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సం ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భారతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంఈసీలో 40, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయని అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### పని చేయకుంటే వేటు తప్పదు

కోట: పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా హెచ్చరించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించలేదని మండిపడ్డారు. బుధవారం కోట తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు, వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు.రెవిన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించని వీఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. తహశీల్దార్ జయజయరావు, డీటీ అజంతుల్లాఖాన్ పాల్గొన్నారు.

### సబ్సిడీ రుణాలకు 275 దరఖాస్తులు

కోట: వివిధ కార్పొరేషన్లకు సంబంధించి సబ్సిడీ రుణాలకు మొత్తం 275 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వేణు బుధవారం తెలిపారు. బీసీ కార్పోరేషన్‌కు 15 యూనిట్లకు 264 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదేవిధంగా రెడ్డి, కాపు కార్పొరేషన్ కింద 11 యూనిట్లకు 11 దరఖాస్తులు వచ్చాయన్నారు. సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

### ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



కోట: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాకాడు ఆర్టీసీ డిపో అధికారులు కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పెంచలయ్య మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రూప, ఆర్టీసీ సీటీఓ కిష్టమ్మ, సూపర్‌వైజర్ రఘు రామయ్య పాల్గొన్నారు.

### అర్హులకు టిడ్కో గృహాలు అందజేయాలి

సూళ్లూరుపేట రూరల్: పనులు పూర్తయిన టిడ్కో గృహాలను ప్రభుత్వం అర్హులైన వ్యక్తులకు వెంటనే అంజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు వద్ద ఉన్న టిడ్కో గృహాలను సీపీఐ నేతలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు 90 శాతం పనులు పూర్తయ్యాయయని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అర్హులైన వ్యక్తులకు గృహాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా చొరవ చూపించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోదుగుల పార్థసారథి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ

సూళ్లూరుపేట: పట్టణంలోని కోళ్లమిట్ట శ్రీభగవాన్ వెంకయ్యస్వామి ధ్యాన మందిరానికి ముఖద్వారం నిర్మించేందుకు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా బుధవారం భూమిపూజ నిర్వహించారు. ముందుగా వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ముఖద్వారం భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాళ్లు, మేడా సాయి, కుదిరి పెంచలయ్య, కొండలరావు, కొమరంజేరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### పండుగలా స్వచ్ఛ ఆంధ్ర

సైదాపురం: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌ను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వద్ద ఈ నెల 15వ తేదీన ప్రజాప్రతినిధులతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 250కి పైగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు.

కండలేరు జలాశయం నుంచి చెన్నైకి తరలుతున్న నీరు



గంగ కాలువలో నీటి ప్రవాహం



కండలేరు ఆయకట్టు పరిధిలో వరి నాట్లు



# కండలేరు కాపాడుతోంది

**ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు వరప్రదాయినిగా ఉన్న కండలేరు జలాశయం రైతాంగాన్ని కాపాడుతోంది. రోజురోజుకు నీటి మట్టం పెరుగుతుండడంతో అన్నదాతల ఆశలన్నీ కండలేరు జలాశయంపైనే పెట్టుకున్నారు. ప్రధానంగా నాన్‌డెల్టా రైతుల ఆశలు మరింత చిగురిస్తున్నాయి. కండలేరు జలాశయంలో ఇప్పటికే 53 టీఎంసీల నీటి నిల్వలు ఉండడంతో రబీ సాగుకు ఢోకా లేదని రైతులు భావిస్తున్నారు. ఇటీవల నెల్లూరులో జరిగిన ఐఏబీ సమావేశంలో కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాలోని కొన్ని మండలాలకు కండలేరు జలాశయం ద్వారా సాగు నీరందించేందుకు ప్రతిపాదనలు చేశారు.** – సైదాపురం

- కండలేరులో 53 టీఎంసీల నీటి నిల్వ
- రబీకి ఇబ్బందులు లేనట్లే..

ప్రధానంగా కండలేరు జలాశయంలో ప్రస్తుతానికి 53 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రధానంగా వర్షాధారంగానే నాన్‌డెల్టా ప్రాంతంలో వరి పండించే వారు. ఈ ప్రాంతంలో చెరువులు నిండితేనే వరి పంట పండేది. అయితే సాగు నీటి కోసం కాలువలు తవ్విన తర్వాత ఆ పరిస్థితులు మారాయి.



కండలేరు జలాశయం

అయితే నాన్‌డెల్టాకు సాగునీటి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉండేవి. ప్రస్తుతం సోమశిలలో 64 టీఎంసీలు, కండలేరులో 53 టీఎంసీల నీటి నిల్వలు ఉండడంతో రబీ సాగుకు ఇబ్బందులు తలెత్తవని అన్నదాతలు భావిస్తున్నారు. కండలేరు జలాశయంలో పుష్కలంగా నీరు ఉండడంతో ఆయకట్టు రైతులకు రబీపై మరింత భరోసా కలిగింది.

**కండలేరులో 53 టీఎంసీలు**

కనీవినీ ఎరుగని రీతిలో ఫిబ్రవరి నెలలో 53 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధానంగా సర్వేపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాలకు చెందిన రైతులకు కండలేరు జలాశయం నుంచి వచ్చే నీటిని ఆధారంగా చేసుకుని రబీ పంట సాగవుతుంది. దీంతో ఈ ఐదు నియోజకవర్గాల్లోని రైతులు రబీ సాగు చేస్తున్నారు. కండలేరు జలాశయంలోకి 53 టీఎంసీలు నీరు చేరింది.

**కాలువలకు నీరు విడుదల**

కండలేరు జలాశయం ద్వారా ప్రతి ఏటా కాలువలకు నీరును విడుదల చేసేవారు. దీంతో చెరువుల్లో సమృద్ధిగా నీరు చేరేది. అని అన్నదాతలు వ్యవసాయ పనులను ప్రారంభించే వారు. సర్వేపల్లి, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లోనే చెరువులకు ప్రతి ఏటా కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చే శారు. దీంతో కండలేరులో 53 టీఎంసీల నీరు చేరింది. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కులు, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కులు వంతున నీరు విడుదల చేస్తున్నారు. దీంతో కండలేరు నుంచి చెరువులకు సాగునీరు అందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

### మూడు లక్షల ఎకరాలకు ఆధారం

కండలేరు జలాశయం పరిధిలో సుమారు మూడు లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని ఈ 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు కండలేరు జలాశయం నీరే ఆధారం. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు నీటి అవసరాలకు విడతల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు.

**రైతుల ఆశలు తీరుతున్నాయి**



రబీ సీజన్‌లో రైతుల ఆశలు తీరనున్నాయి. నాన్‌డెల్టా ప్రాంత రైతులు రబీ సీజన్‌లో పంటలు పండించుకునే అవకాశం ఏర్పడింది. అధికారులు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది.

– నలమారు రాంగోపాల్‌రెడ్డి, గులించెర్ల, సైదాపురం మండలం

**కైవల్యానదికి గంగ నీరు**



ఈ ఏడాది సాగు నీటి కోసం పడరాని పాట్లు పడ్డాం. కానీ ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో కండలేరు జలాశయంలో 53 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరు నుంచి కైవల్యానదికి నీరును విడుదల చేయడంతో సాగునీరు ఇబ్బందులు లేకుండా పోతుంది.

– బి.శివకుమార్, సైదాపురం

### చెంగాళమ్మకు క్షీరాభిషేకం



శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో 108 క్షీర కలశాలకు పూజలు

సూళ్లూరుపేట: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానంలో క్రోధి నామ సంవత్సరం మాఘమాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా బుధవారం క్షీరాభిషేకం, మహాచండీయాగం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోధ్చారణ, మంగళవాయిద్యాలతో 108 క్షీర కలశాలను అమ్మవారి ఆలయంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతోపాటుగా ప్రాకారోత్సవం నిర్వహించి, అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన మహా చండీయాగం కార్యక్రమాన్ని వేద పండితులు వేదమంత్రోఛార్చణతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెరుకుపల్లి రామ్‌కుమార్–శ్రీలక్ష్మీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### కలువాయి ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

కలువాయి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఖాదర్‌వలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వసతులు, వైద్య సేవలు, సిబ్బంది పనితీరుపై ఆయన సమీక్షించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. డాక్టర్ రామకుమారి, డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీ యాగం

చిల్లకూరు: తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం చండీ యాగం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో చండీ యాగం చేయడం ఆనవాయితీ. ఆలయంలో ప్రత్యేకంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి 12 కలశాలు ఏర్పాటు చేసి పూజలు చేపట్టారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ అర్చకులు శివకుమార్‌స్వామి సిబ్బంది పాల్గొన్నారు.



కలశాల వద్ద పూజలు

## శ్రీలక్ష్మీనరసింహునికి బంగారు హారం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెలసియున్న శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని శ్రీఆదిలక్ష్మీ అమ్మవారికి బుధవారం దాతలు బంగారు హారాన్ని బహూకరించినట్లు దేవస్థానం ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు చెందిన మెరువా ప్రవీణ్‌కుమార్, మధురిమ దంపతులు, వారి పిల్లలు యశస్వి, మన్విత్ 69 గ్రాముల రాళ్లతో కూడిన బంగారు హారాన్ని అందించినట్లు వివరించారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి పాల్గొన్నారు.



బంగారు హారాన్ని అందిస్తున్న దాతలు

## ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలి

ఓజిలి: మండలంలోని రాచపాళెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అదే గ్రామంలో కొనసాగించాలని ఎస్ఎంసీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా అనుమతులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఇక్కడ పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 తరగతులు విద్యార్థులు దూరంగా ఉన్న భట్లకనుపూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామంలోనే ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని ఎస్ఎంసీ తీర్మానం చేశారు. హెచ్ఎం హరికిశోర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీహరిత తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ భవిష్యత్తు ఇచ్చింది

గూడూరు రూరల్: అతిథిగా వచ్చిన వారిపై సెటైర్‌లు వేసి నవ్వుకునే ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు భవిష్యత్తు ఇచ్చింది వైఎస్సార్ సీపీనే అని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ చురకలు అంటించారు. గూడూరు సనత్ నగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. టీడీపీ పైశాచికత్వానికి బాధితుడైన వ్యక్తి ఆవేదనపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి ఎండగట్టడంపై సెటైర్లు వేయడంపై ఆయన మండిపడ్డారు.నియోజకవర్గంలో పని చేసే ఓ సీఐ కులం పేరుతో దూషిస్తూ ఎంతో మందిని చావ చితక బాదుతున్నాడని దీనికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని అన్నారు. అధికారం చేపట్టి 8 నెలలు అవుతుంటే రౌడీషీటర్ల పుట్టిన రోజు వేడుకలకు హాజరు కావడం, వారితో సఖ్యతగా ఉండేలా ఫ్లెక్సీలు వేసుకోవడం దారుణమన్నారు. కూటమి అధికారం చేపట్టిన అనంతరం నియోజకవర్గంలో ఆరు హత్యలు జరిగాయన్నారు. ఎంపీపీ బూదూరు గురవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టా రాధాక్రిష్టారెడ్డి , బొమ్మిడి శ్రీనివాసులు, సంపత్‌కుమార్‌రెడ్డి, అట్ల శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, సుభాన్, గోపియాదవ్, జలీల్, బలరాంనాయుడు, రాజీవ్‌రెడ్డి, కాలేషా, జగదీష్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

## వైభవంగా పుష్పయాగం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి పుష్పయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, చెంచులక్ష్మిదేవి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభయమానంగా అలంకరించారు. 350 కేజీల 20 రకాల పుష్పాలతో పుష్పయాగం చేపట్టారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, స్వామి అమ్మవార్లను కోన మాడ వీధుల్లో ఊరేగించారు. ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, భక్తులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పుష్పాభిషేకం



పుష్పయాగానికి తీసుకువచ్చిన పుష్పాలు

### ఇంకుడు గుంతల ఏర్పాటుకు సన్నాహాలు

చిల్లకూరు: ప్రతి ఇంటి నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నీరు ఇంకి పోయి భూగర్భ జలాలు పెరిగేలా చేసేందుకు ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలని ఎంపీడీఓ గోపి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం, మండల పరిషత్, పీఆర్ అధికారులతో ఆయన సమీక్షించారు. మండలంలో 2 వేల వరకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి వారి ఇంటి వద్ద గుంతను తవ్వేలా చేయాలని అన్నారు. ఏపీడీ వరప్రసాద్, ఏపీఓ గిరిబాబు, పీఆర్ ఏఈ ఇలియాజ్, ఈఓపీఆర్‌డీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### వినియోగంలోకి సంపద తయారీ కేంద్రాలు

పెళ్లకూరు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌పీఓ రవీంద్రబాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం తాళ్వాయిపాడు, శిరసనంబేడు గ్రామాల్లో ఉన్న సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. చెంబేడు, పునబాక, పెళ్లకూరు, నెలబల్లి, అర్ధమాల, నందిమాల, కానూరు తదితర గ్రామాల్లో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చెత్త సేకరణతో గ్రామాలు పరిశుభ్రంగా మారుతాయన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, నాయకులు వీరకుమార్ ఉన్నారు.

### పినాకిని ఎక్స్‌ప్రెస్ పాక్షికంగా రద్దు

నాయుడుపేట టౌన్: విజయవాడ నుంచి చెన్నైకు వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం గూడూరు నుంచి చెన్నై వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు నాయుడుపేట రైల్వే ఎస్ఎం సీహెచ్ చిరంజీవి బుధవారం తెలిపారు. పోన్నేరి–కవర్‌పేట మధ్యలో జరుగుతున్న రైల్వే లైన్ మరమ్మతుల కారణంగా ఈ అసౌకర్యం ఉందని తెలిపారు.

**గూడూరు నుంచి దారి మళ్లింపు**

మధురై నుంచి నాయుడుపేట మీదుగా చండీగడ్‌కు వేళ్లే ప్రత్యేక రైలు (రైలు నంబరు 20493) కూడా గురువారం దారి మళ్లించినట్లు ఎస్ఎం చిరంజీవి తెలిపారు. ప్రత్యేక రైలు అరక్కోణం నుంచి తిరుత్తణి మీదుగా రేణిగుంట, గూడూరుకు దారి మళ్లించి రాకపోకలు జరుపుతున్నట్లు ప్రకటించారు.

### నియోజకవర్గానికో నగరవనం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని వల్లివేడు సమీపంలో ఏర్పాటు చేసిన నగరవనాన్ని బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, అటవీశాఖ ఎఫ్ఏసీ సెల్వం, డీఎఫ్ఓ పి.వివేక్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. తొలుత నగరవనంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ఆవిష్కరించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఫ్ఏసీ సి.సెల్వం మాట్లాడుతూ రాష్ట్రంలో 100 నగరవనాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి, బీజేబీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, ఫారెస్ట్ రేంజర్ లోకేష్ , ఎంపీడీఓ కోటేశ్వరరావు, సీఐ ఏవీ రమణ, డీఆర్‌ఓలు సుహాసిని, ప్రతాప్‌రెడ్డి, కోటేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్ పాత్రికేయుడికి పరామర్శ

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం నాయుడుపేటకు చెందిన సీనియర్ పాత్రికేయుడు అద్దూరు రవిని పరామర్శించారు. రవి తల్లి ఈ నెల 4వ తేదీన మృతి చెందారు. దీంతో సంజీవయ్య వైఎస్సార్ సీపీ నాయకుడు అనిల్‌రెడ్డి తదితరులతో కలిసి పట్టణంలోని రవి నివాసం వద్దకు వెళ్లి పరామర్శించారు.

## గుప్తనిధుల కోసం తవ్వకాలు

ఓజిలి: పురాతన శివాలయంలో గుప్తనిధుల కోసం గుర్తుతెలియని దుండగులు తవ్వకాలు జరిపారు. ఈ సంఘటన ఓజిలి మండలం వజ్జవారిపాళెం గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని చెరువు కట్టపై పురాతన శివాలయం ఉంది. బుధవారం ఉదయం శివాలయంలో ప్రదక్షిణలు చేయాలని ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని చూసి స్థానికులకు సమాచారం అందించారు. గ్రామస్తులు ఆలయం చేరుకుని శివాలయంలో లోపలికి వెళ్లి చూడగా శివుని విగ్రహాన్ని పక్కకు జరిపి 3 అడుగుల మేర గుంత తీశారు. పురాతన ఆలయం కావడంతో విగ్రహం కింద నిధులు ఉంటాయని తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ స్వప్న ఆలయంలో తవ్వకాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



విగ్రహం కింద తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు

## వంటశాల నిర్మాణానికి సహకారం

నాయుడుపేట టౌన్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వంట శాల భవన నిర్మాణానికి అమెరికాలోని ప్రవాస భారతీయులు (బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్, యూఎస్ఏ)ఆర్థిక సాయం చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్ వెల్లడించారు. ఉన్నత పాఠశాల వద్ద వంటశాల భవన నిర్మాణం కోసం బుధవారం రోటరీ క్లబ్ వారు పాఠశాల హెచ్ఎం సీహెచ్ సురేష్‌బాబు, ఉపాధ్యాయులతో కలిసి భూమి పూజ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడితోపాటు సెక్రటరీ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన ఎన్ఆర్ఐలు రూ.1.55 లక్షల నగదు చెక్కును వంటశాల నిర్మాణానికి అందించినట్లు వివరించారు. ఆదవరం నాగూరయ్య, మునగాల కృష్ణారావు, బట్టా సుబ్రహ్మణ్యం యాదవ్, పీడీ ఉదయ శంకర్, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నాయకులదే పెత్తనం

– ఆలయ ఈఓ నిర్వాకం

చిల్లకూరు: ముత్యాలమ్మ ఆలయ ఈఓ నవీన్‌కుమార్‌కు పాలక మండలి వద్దు, నేటి నాయకులే ముద్దు అనేలా ప్రవర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నాయకులు చెప్పినట్లు చేస్తూ విమర్శలకు తావిస్తున్నారు. తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన పాలక మండలి కాల పరిమితి మార్చి నెల 25 వరకు ఉంది. ఈలోగా ఆలయంలో చేసే ప్రతి కార్యక్రమం పాలక మండలి ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంది. మార్చి నెలాఖరులో జరిగే ముత్యాలమ్మ జాతరకు సంబంధించి పలు పనులకు, జాతర అనంతరం ఆలయం వద్ద నిర్వహించేకునే దుకాణాల వేలం పాటలను చేపడుతున్నారు. వీటిని ఆలయ ఈఓ నవీన్‌కుమార్ ఏక పక్షంగా సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకుండా కూటమి నాయకుల మధ్య నిర్వహించడ వివాదాస్పదమైంది. కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడంపై ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబును వివరణ కోరగా ఈ విషయాలు పూర్తిగా ఆలయ ఈఓ చూసుకుంటున్నాడని అన్నారు.



కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేలం పాటలు

### క్యాలెండర్ ఆవిష్కరణ

వాకాడు: గురుకుల పాఠశాల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ రామయ్య చేతులు మీదుగా ఆవిష్కరించి, పంపిణీ చేశారు. అనంతరం పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక హేమంత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవా, ఇంద్రప్రసన్న, కస్తూరయ్య, రాజకుమారి, దావీదు, సుబ్బయ్య, నాగరాజు పాల్గొన్నారు.